# పౌరులపై సామూహిక గూఢచర్యం జరుపుతున్న 'ప్రజాస్వామ్య' పాలకులు

**2018** డిసెంబర్ 21న, హోంమంత్రిత్వ శాఖకు చెందిన కంప్యూటర్ సంబంధిత సమాచార భద్రతావిభాగం, దేశంలో రక్షణ, నిఘా చర్యలు చేపడుతున్న 10 కేంద్రసంస్థలకు "కంప్యూటర్‌లోని ఏ సమాచారాన్నైనా, పంపించిన లేదా అందుకొన్న ఏ విషయాన్నైనా, కంప్యూటర్‌లో నిక్షిప్తంచేసుకున్న ఎవరి అంశాన్నైనా" పరిశీలించి, పరిశోధించి, వివరించే అధికారం కల్పించ బడింది. ఈవిధంగా ఇంటలిజెన్స్ బ్యూరో(ఐబి), రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(ఆర్ఏడబ్ల్యు -'రా'), ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్(ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్(సిబిఐ), ఢిల్లీ కమీషనర్ ఆఫ్ పోలీస్ మరియు ఈ తరహా సంస్థలన్నింటికీ కేంద్రప్రభుత్వం విస్తృతమైన అధికారం కల్పించింది.

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ఈ అధికారాలు కల్పించటంద్వారా, పార్లమెంటరీ ప్రజాస్వామ్య బుకాయింపులకు స్వస్తిపలికి తన నిరంకుశ, ఆధిపత్యవాద అసలైన స్వభావాన్ని బయల్పరచుకుంది. మన 'పవిత్ర' రాజ్యాంగం ప్రజలకు కల్పించిందన్న ప్రాథమిక హక్కులు గానీ, 2017 ఆగస్టులో 9 మంది న్యాయ మూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొన్న 'వ్యక్తిగత గోప్యత ప్రజల ప్రాథమిక హక్కు' అన్న ఆదేశం గానీ, 2018 నాటి ఇండియన్ ప్రైవసీకోడ్‌లో పేర్కొన్న సూత్రాలు గానీ-ఎందుకూ కొరగానివేనని తేల్చిచెప్పింది.

కార్మికచట్టాలు, వాటి స్వభావం విషయంలో ప్రభుత్వం, పాలకులు-బ్రిటిష్ రాజ్యం నాటి కాలంచెల్లిన చట్టాలను రద్దుచేయాలని వాదన చేస్తారు. కానీ అదే పౌరుల ప్రాథమిక హక్కుల తొలగింపు అంశం వచ్చేసరికి, ప్రభుత్వాలు, పాలకులు బ్రిటిష్ వలసపాలకులు అందించి వెళ్ళిన టెలిగ్రాఫ్ చట్టం-1885 వంటి వాటిని అరువు తెచ్చుకుంటారు. ఈ చట్టం టెలిఫోన్‌లపై నిఘాను ఆమోదిస్తుంది. దీనికనుగుణంగానే ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000 కూడా, బ్రిటిష్ వలసపాలకుల క్రూరమైన చట్టాలపై ఆధారపడి చేసిందే. దీనికితోడు పాలకులు వారి నిఘా కార్యక్రమాలకు సిబిఐ వంటి అప్రతిష్ట పాలైన పలు ఇతర సంస్థలను వినియో గిస్తున్నారు. ఇవన్నీ బ్రిటిష్ వలసపాలకుల నుండి సంక్రమించినవే. ఇవేమీ పార్లమెంటరీ పరిశీలన లోకి వచ్చేవి కావు.

ఈవిధమైన నిఘా అధికారాలను దఖలు పరచటంతో, ప్రజలపై నిఘా వుంచిన దేశాలలో ఆస్ట్రేలియా వంటి దేశాల సరసన తాజాగా మనదేశం చేరింది. ప్రజలపై నిఘా వుంచే ఎన్‌డిఏ ప్రభుత్వ నగ్నమైన చర్యమినహా ఇది మరోటి కాదు.

ఎన్‌డిఏ ప్రభుత్వం మరియు పాలకులు ఈ చర్యను జాతీయ భద్రతకు హామీఇచ్చే చర్యగా పేర్కొంటూ సమర్థించుకోవటంతో పాటుగా, జాతీయ భద్రతకు పెనుముప్పుగా నున్న టెర్రరిస్టు ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి, నిస్తేజం చేసేందుకేనని ప్రకటిస్తున్నారు.

ప్రజాస్వామ్యపు గొప్ప సుగుణాలుగా పేర్కొనబడుతున్న పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్యంలో వ్యక్తుల స్వేచ్ఛకు, వ్యక్తుల హక్కులకు, వ్యక్తుల గోప్యతకు హక్కుల సమర్థన వుండటంతోపాటు ఇతరేతర అంశాలన్నింటి కంటే అత్యధిక ప్రాధాన్యత, గౌరవం, రక్షణ కల్పించబడతాయని ప్రపంచ దేశాలలో ప్రజానీకం ముగ్ధులవుతూ వున్నారు.

అయితే, ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం వివిధ నిఘాసంస్థలకు కల్పించిన అధికారం, సామూహికంగా ప్రజలపై గూఢచర్యం వహింప జేయటం వంటి వాటిద్వారా ప్రజాస్వామ్యం గురించిన ఇలాంటి ప్రకటనలలోని మోసకారితనం, డొల్లతనం వెల్లడవుతోంది. ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకుంటోన్న మరికొన్ని దేశాల లోనూ ఈ తరహా 'నిఘా' అధికారాలు కొనసాగు తున్నాయి.

ప్రజలపై సామూహికంగా నిఘా పెట్టటమనే ఈ అధికారం కల్పించటం నిర్బంధం, అణచివేత మినహా మరోటి కాదు.

1947 నుండి కూడా ప్రజలపై వివిధ కారణాలతో వరుసగా అధికారంలో కొనసాగుతున్న ప్రభుత్వాలన్నీ వివిధ క్రూరమైన చట్టాలను ప్రయోగించి నిర్బంధం, అణచివేతకు పాల్పడటం ద్వారా భారతదేశంలో పోలీసు రాజ్యం కొనసాగుతోందని పదేపదే రుజువు చేస్తూనే వస్తున్నారు.

ప్రస్తుత ఎన్‌డిఏ పాలకులు దఖలుపరచిన ఈ అధికారం భారతదేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగు ధరించిన పోలీసు రాజ్యమేనని మరోసారి నిర్ధారణ చేస్తోంది.

జాతీయ భద్రతకోసమో, టెర్రరిస్టు చర్యలను ముందుగా పసిగట్టి వాటిని భగ్నం చేయటం కోసమో, ఎన్‌డిఏ ప్రభుత్వం ఈ విధమైన అధికారాన్ని ఆయా సంస్థలకు దఖలుపరిచిందని ఎవరూ భ్రమపడాల్సిన అవసరంలేదు.

ఎన్‌డిఏ పాలకులు వాస్తవానికి హిందూ మతతత్వ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తూ, సాధారణ ప్రజానీకాన్ని భీతావహుల్ని చేస్తూ, వారిని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు జూస్తున్నారు.

ప్రజలపై సామూహికంగా గూఢచర్యం నెరిపే ఈ అణచివేత ఆదేశానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామిక శక్తులంతా ముక్తకంఠంతో గళం విప్పాలి.

ooooo